సాక్షి బాపట్ల

సోమవారం ౹ 3 ౹ జూన్ ౹ 2024



న్యాయవిజ్ఞాన సదస్సు

వినుకొండ(నూజెండ్ల): జాలలపాలెంలో ఆదివారం జూనియర్ సివిల్ జడ్జి ఎం. మహతి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది.



బండ్లమ్మకు ప్రత్యేక పూజలు

పిట్టలవానిపాలెం: చందోలు బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు జరిపించారు.



ముగిసిన హనుమత్ జయంత్యుత్సవాలు

నగరంపాలెం: కొత్తపేటలోని ఆంజనేయ స్వామి దేవస్థానంలో స్వామి వారి హనుమత్ జయంత్యుత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి 'మధ్యవర్తిత్వం' శిక్షణ తరగతులు

గుంటూరు జిల్లా ఒకటో ఏడీజే కోర్టు హాల్‌లో ప్రారంభం

నగరంపాలెం: గుంటూరు జిల్లా కోర్టు ఆవరణలోని ఒకటో అదనపు జిల్లా జడ్జి (ఏడీజే) కోర్టు హాల్‌లో 'మధ్యవర్తిత్వం' పై గుంటూరు జోన్‌లోని జిల్లాల జడ్జిలకు శిక్షణ తరగతులు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. సుప్రీంకోర్టు మీడియేషన్/ కాన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (ఎంసీపీసీ- న్యూఢిల్లీ), రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (అమరావతి) ఆధ్వర్యంలో గుంటూరు, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని న్యాయాధికారులకు నలభై గంటల శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఐదు రోజులపాటు జరిగే శిక్షణ తరగతులకు ముఖ్య అతిథులుగా, శిక్షణ అందించేందుకు ఎంసీపీసీ న్యూఢిల్లీ నుంచి వీకే బాన్సాల్ (జిల్లా జడ్జి), మన్మోహన్ శర్మ (జిల్లా జడ్జి) హాజరుకానున్నారు. ఈనెల మూడో తేదీ నుంచి ఏడు వరకు గుంటూరు జోన్‌లోని జిల్లా జడ్జిలకు శిక్షణ అందించనున్నారు. గత నెల 21–24 వరకు తొలి విడతగా జోన్‌లోని జిల్లాల్లో పలువురు జడ్జిలకు మధ్యవర్తిత్వంపై శిక్షణ అందించిన విషయం విదితమే. ఈ క్రమంలో రెండో విడతగా ఈ శిక్షణ తరగతులు ప్రారంభించనున్నారు.

నేటి సాయంత్రం నుంచి మద్యం షాపులు బంద్

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ మంగళవారం జరగనున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి మంగళవారం వరకు మద్యం షాపులు, బార్‌లు పూర్తిగా బంద్ చేయాలని గుంటూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.వెంకట్రామిరెడ్డి తెలిపారు. కౌంటింగ్ పూర్తయిన మరుసటి రోజైన 5వ తేదీన షాపులు తెరవాలని సూచించారు.

పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలనకు 219 మంది హాజరు

- నేడు జరగాల్సిన సర్టిఫికెట్ల పరిశీలన ఆరో తేదీకి వాయిదా
- ఈనెల 7 నుంచి వెబ్ ఆప్షన్లు నమోదు




గుంటూరు ఎడ్యుకేషన్: పాలిసెట్–2024 కౌన్సెలింగ్‌లో భాగంగా నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నిర్వహిస్తున్న సర్టిఫికెట్ల పరిశీలనకు ఆదివారం 219 మంది విద్యార్థులు హాజరయ్యారు. పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం సోమవారం ముగియాల్సి ఉండగా, సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లతో విధించిన 144 సెక్షన్ కారణంగా సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియను ఈనెల 6వ తేదీకి వాయిదా వేశారు. ఈనెల ఆరో తేదీన జరగనున్న సర్టిఫికెట్ల పరిశీలనకు 1,08,001 నుంచి ఆపై చివరి ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాలని హెల్ప్‌లైన్ కేంద్రం సమన్వయకర్త టి.శేఖర్ పేర్కొన్నారు. అదేవిధంగా వెబ్ కౌన్సెలింగ్‌కు సవరించిన షెడ్యూల్ ప్రకారం ఆయా ర్యాంకుల వారీగా ఈనెల ఏడు నుంచి 10వ తేదీవరకు ఆప్షన్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కళ్యాణార్థం, సర్వ మానవాళికి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ నిర్వహించగా పలువురు ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. సేవలో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 504.60 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 806.20 అడుగుల వద్ద ఉంది.

కౌంటింగ్‌కు కట్టుదిట్ట భద్రత

- 450 మంది పోలీసులతో బందోబస్తు
- సునిశిత తనిఖీ తర్వాత కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి
- విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు
- చెక్‌పోస్టుల వద్ద కూడా తనిఖీలు ముమ్మరం
- సమీక్షలో ఎస్పీ వకుల్‌జిందాల్



సమావేశానికి హాజరైన జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు

బాపట్లటౌన్: కౌంటింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్ట భద్రత కల్పించినట్టు ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జిల్లాలోని సీఐ, ఎస్ఐలతో కౌంటింగ్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఇప్పటికే నాకాబందీ నిర్వహించి సీజ్ చేసిన వాహనాలు కౌంటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాతనే విడుదల చేయాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద క్రాస్ అయ్యే ప్రతివాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీచేసి పార్కింగ్ ప్రదేశంలోకి అనుమతించాలన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద బారికేడ్, క్యూలైన్‌లు, క్లాక్ రూమ్, కంట్రోల్ రూమ్ వద్ద అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కౌంటింగ్ సెంటర్‌కు 200 మీటర్లు బయట వాహనాలను తనిఖీ చేసి పంపాలని, 100 మీటర్లు దూరంలో అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బందిని ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేసి, వారి గుర్తింపు కార్డులను పరిశీలించిన తర్వాతనే కేంద్రాల్లోకి అనుమతించాలన్నారు. కౌంటింగ్ సెంటర్ లోపలికి ప్రవేశించే ద్వారం దగ్గర మరోసారి క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, కౌంటింగ్ కేంద్రాల్లో నిబంధనలకు విరుద్ధంగా కవ్వింపు చర్యలకు, ఘర్షణలకు ఎవరైనా పాల్పడితే వెంటనే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల అభ్యర్థులకు, ఏజెంట్లకు, ఉద్యోగస్తులకు వేర్వేరుగా పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశామన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలకు సంబంధించిన డ్రైవర్లు మాత్రమే ఉండాలన్నారు. పట్టణంలో విధులు నిర్వహించే పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రజలు గుంపులుగా తిరగకుండా చూసుకోవాలన్నారు. జూన్ 3న సాయంత్రం నుంచి బాపట్ల జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. పట్టణంలో దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు ఇతర వ్యాపార సముదాయాలు తెరవరాదన్నారు. లాడ్జిలు, రిసార్ట్స్ ఇతర ప్రదేశాల్లో ఎవరూ బస చేయడానికి అనుమతి లేదన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

ర్యాలీలు.. సభలకు అనుమతి లేదు

కౌంటింగ్ అనంతరం విజయోత్సవ ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించడానికి వీలులేదని ఎస్పీ పేర్కొన్నారు. ఇతరులను రెచ్చగొట్టేలా, కించపరిచేలా వ్యాఖ్యలు చేయరాదని, బాణసంచా కాల్చరాదని స్పష్టం చేశారు. కౌంటింగ్ కేంద్రాలు, పరిసర ప్రాంతాల్లో 450 మంది పోలీసు అధికారులు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని వివరించారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే తగిన చర్యలు తీసుకోవడానికి ప్రత్యేక బలగాలనూ సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లా వ్యాప్తంగా 95 పికెట్, 43 మొబైల్ పెట్రోలింగ్, 32 క్విక్ రియాక్షన్ బృందాలు, 6 స్ట్రైకింగ్ పార్టీలు, 3 స్పెషల్ స్ట్రైకింగ్ పార్టీలను ఏర్పాటు చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్, ఎన్నికల కౌంటింగ్ విధులు నిర్వహించనున్న పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి ట్రాఫిక్ మళ్లింపులు

నగరంపాలెం(గుంటూరు): ఈనెల 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు దృష్ట్యా ట్రాఫిక్ మళ్లింపులు చేసినట్లు గుంటూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు నగరం నుంచి విజయవాడ వెళ్లే వాహన చోదకులు గుర్తించాలని చెప్పారు. ఈ మార్పులు ఈనెల మూడో తేదీ రాత్రి పది గంటల నుంచి అమల్లోకి వస్తాయని తెలిపారు. సోమవారం రాత్రి పది గంటల నుంచి మొదలుకుని మంగళవారం ఓట్ల లెక్కింపు ముగిసే వరకు గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే అన్ని వాహనాల రాకపోకలు మళ్లించామని అన్నారు. గుంటూరు నుంచి విజయవాడ వైపు వెళ్లే వాహనాలు బుడంపాడు జంక్షన్ వద్ద హైవే దిగి, తెనాలి, వేమూరు, కొల్లూరు, వెల్లటూరు జంక్షన్, పెనుమూడి బ్రిడ్జి, అవనిగడ్డ, పామూరు – గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి(ఇరువైపులా). బాపట్ల వైపు వెళ్లే వాహనాలు బోయపాలెం, ప్రత్తిపాడు మీదుగా బాపట్ల వైపు వెళ్లాలి. గుంటూరు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు పేరేచర్ల జంక్షన్ నుంచి సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లాలి. విజయవాడ వైపు అనుమతిలేదు. చిలకలూరిపేట వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు వై.జంక్షన్ (గుంటూరు) నుంచి చుట్టుగుంట, పేరేచర్ల మీదుగా వెళ్లాలి.

ఫ్యాన్ ప్రభంజనమే

- మహిళా ఓటింగ్‌పై అధికార పార్టీ నమ్మకం
- గెలుపు భరోసాతో కౌంటింగ్‌కు సిద్ధం
- ఎగ్జిట్ పోల్స్‌తో మరింత పెరిగిన జోష్
- వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం
- అత్యధిక స్థానాలు గెలుచుకుంటామని ధీమా

సాక్షి ప్రతినిధి,బాపట్ల: ఎన్నికల ఫలితాలు అధికార వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉంటాయని మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ స్పష్టం చేయడంతో ఆ పార్టీ శ్రేణుల్లో రెట్టించిన ఉత్సాహం కనిపిస్తోంది. అసెంబ్లీతోపాటు పార్లమెంట్ పరిధిలోనూ అత్యధిక స్థానాలు గెలుచుకుంటామనే ధీమా వ్యక్తమవుతోంది. గెలుపుపై భరోసాతో కార్యకర్తలు మంగళవారం జరిగే కౌంటింగ్‌కు సిద్ధమవుతున్నారు. గత కొంతకాలంగా ఎల్లో మీడియా, బోగస్ ఎగ్జిట్ పోల్స్ పచ్చపార్టీదే గెలుపంటూ ఊదరగొట్టాయి. కానీ వాటన్నింటినీ కొట్టిపారేస్తూ ప్రఖ్యాత సర్వే సంస్థలు చేసిన ఎగ్జిట్‌పోల్స్ అన్నీ అధికార పార్టీకే పట్టం కట్టడంతో ప్రతిపక్షాల వెన్నులో వణుకు మొదలైంది.

మహిళా ఓట్లే కీలకం..

ఎగ్జిట్ పోల్స్ అంచనా ప్రకారం అధికార పార్టీకి మహిళా ఓటర్లు అండగా నిలిచినట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 54.76 శాతం మంది మహిళలు ఓట్లు వేసినట్లు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేస్తున్నాయి. బాపట్ల జిల్లాలో పురుషులతో పోలిస్తే మహిళా ఓట్లు అధికంగా పోలయ్యాయి. పోలింగ్ సందర్భంగా మహిళల్లో చైతన్యం కనిపించింది. ఓటు వేయాలన్న కసి వారిలో వ్యక్తమైంది. దీంతో అన్ని పనులూ వదలిపెట్టి మహిళా ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ మహిళలు అధికంగా ఓట్లు వేశారు. ఇది అధికార పార్టీకి కలిసి వస్తోందని పరిశీలకుల అంచనా.

బాపట్ల జిల్లాలోనూ వనితలదే నిర్ణయాధికారం

జిల్లాలో మొత్తం 12,91,716 ఓట్లు ఉండగా 16,767 పోస్టల్ బాలెట్లతో కలిపి 11,16,750 ఓట్లు (86.45 శాతం) పోలయ్యాయి. ఇందులో 5,38,553 పురుషులు ఓట్లు కాగా 5,61,389 మహిళా ఓట్లు ఉన్నాయి. పురుషులతో పోలిస్తే జిల్లావ్యాప్తంగా 22,836 మహిళల ఓట్లు అధికంగా పోల్ కావడం గమనార్హం. అత్యధికంగా పర్చూరు నియోజకవర్గంలో 4213 మహిళా ఓట్లు పురుషులకంటే అధికంగా పోల్‌కాగా, బాపట్లలో 3,981, అద్దంకిలో 3,936, చీరాలలో 3,905, వేమూరులో 3,844, రేపల్లెలో 2957 ఓట్లు అధికంగా పోలయ్యాయి. ఇది అధికార పార్టీ విజయానికి సంకేతమని విశ్లేకుల అభిప్రాయం.

పారదర్శకంగా కౌంటింగ్

జిల్లా ఎన్నికల పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి రంజిత్‌బాషా

బాపట్ల : ఓట్ల లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా జరగాలని జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా తెలిపారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం స్థానిక ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఆదివారం జరిగింది. జేసీ సిహెచ్ శ్రీధర్ ప్రొజెక్టర్ ద్వారా కౌంటింగ్‌పై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు పకడ్బందీగా జరగాలన్నారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని చెప్పారు. కౌంటింగ్ సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల సంఘం జారీ చేసిన గుర్తింపు కార్డులు ఉంటేనే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి ఉంటుందని వివరించారు. కౌంటింగ్ కేంద్రాల సమీపంలోకి వాహనాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్.సత్తిబాబు, ఆర్‌ఓలు, శిక్షణ నోడల్ అధికారి ఏపీఎంఐపీ పీడీ బీవీ రమణ, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్ బైపాస్ రయ్..రయ్..!



శరవేగంగా జరుగుతున్న బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు

శరవేగంగా పడమర బైపాస్ రోడ్డు నిర్మాణం

- రూ.1132 కోట్లతో 18 కిలోమీటర్ల మేర నిర్మాణం
- కృష్ణానదిపై 3.2 కిలోమీటర్ల మేర ఆరువరుసల వంతెన నిర్మాణం

మంగళగిరి: మంగళగిరి–తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చినకాకాని నుంచి ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి వరకు నిర్మాణం జరుపుకొంటున్న పడమర బైపాస్ రోడ్డు పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. వాస్తవానికి 2014 సంవత్సరానికి ముందే చినకాకాని నుంచి పశ్చిమగోదావరి జిల్లా గుండుగొలను వరకు 103 కిలోమీటర్లు అవుటర్ రింగ్ రోడ్డు నిర్మించాలని కేంద్రప్రభుత్వం సంకల్పించి టెండర్లు ఖరారు చేసింది. 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం రోడ్డు నిర్మాణానికి సహకరించకపోవడంతో భూసేకరణ సైతం పూర్తయి పనులు ప్రారంభించే సమయంలో రోడ్డు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. టెండర్లు పూర్తి చేసి భూసేకరణ చేపట్టిన ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసేందుకు అధికారులు శిలాఫలకం సైతం సిద్ధం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది.

చకచక పనులు..

అనంతరం రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో వెంటనే బైపాస్ నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. విజయవాడ అవుటర్ రింగ్ రోడ్డును నాలుగు ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలవగా నాలుగో ప్యాకేజీగా ఉన్న చినకాకాని గొల్లపూడి బైపాస్ నిర్మాణాన్ని రూ.1132 కోట్ల వ్యయంతో టెండర్లు దక్కించుకున్న అదానీ ఎంటర్‌ప్రైజెస్ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు ప్రారంభించి శరవేగంగా నిర్మాణం కొనసాగిస్తుంది. 18 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణంతో పాటు కృష్ణానదిపై 3.2 కిలోమీటర్ల మేర ఆరువరుసల వంతెన నిర్మాణం చేయనున్నారు.

విజయవాడలో తగ్గనున్న ట్రాఫిక్ రద్దీ

నిడమర్రు రోడ్డు వద్ద నిర్మిస్తున్న ఫ్లైఓవర్ నిర్మాణంతో పాటు పలు చోట్ల నిర్మిస్తున్న ఫ్లైఓవర్, అండర్ పాస్‌ల పనులు ఇప్పటికే తుది దశకు చేరుకున్నాయి. బైపాస్ రోడ్డు నిర్మాణం అమరావతిలోని పలు గ్రామాల మీదుగా వెళ్తుండడంతో అమరావతికి మరో మణిహారంగా చినకాకాని, గొల్లపూడి బైపాస్ మారనుంది. బైపాస్ నిర్మాణంతో ఈ ప్రాంత వాసులు విజయవాడ వెళ్లేందుకు దూరం తగ్గనుండడంతో పాటు వెంటనే హైదరాబాద్ చేరుకునేందుకు బైపాస్ రహదారి అనుకూలంగా మారనుంది. గుంటూరు నుంచి విజయవాడ మీదుగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు సైతం చినకాకాని నుంచి నూతన బైపాస్ రోడ్డుమీదుగా వెళ్లనుండడంతో మంగళగిరి–తాడేపల్లి రహదారులతో పాటు విజయవాడలోనూ ట్రాఫిక్ తగ్గనుంది. ఈ ఏడాది చివర నాటికి పనులు పూర్తి చేసుకుని ప్రజలకు రోడ్డు అందుబాటులోకి వచ్చే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

నేడు ఫుట్‌బాల్ జిల్లాస్థాయి ఎంపికలు

చీరాల రూరల్: జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం చీరాలలోని ఎస్ఆర్అండ్ పీఎం హైస్కూలు క్రీడామైదానంలో మధ్యాహ్నం 3 గంటలకు సబ్ జూనియర్స్, జూనియర్స్ బాల, బాలికల విభాగంలో జిల్లాస్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు బాపట్ల జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.విజయకుమార్, నాలుగు జిల్లాల కో–ఆర్డినేటర్ నూతలపాటి దేవదాసు, సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంప్ ఇన్‌చార్జ్ బొనిగల ప్రేమయ్య, కోచ్‌లు ప్రసన్న, నరేష్ ఆదివారం తెలిపారు. సబ్ జూనియర్స్ క్రీడాకారులు 1-1-2011 నుంచి 31-12-2012 మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. జూనియర్ క్రీడాకారులు 1-1-2009 నుంచి 31-12-2010 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రం లేదా ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తమవెంట తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు సమ్మర్ ఫుట్‌బాల్ క్యాంప్ ఇన్‌చార్జ్ బొనిగల ప్రేమయ్య 83096 07343, కో–ఆర్డినేటర్ నూతలపాటి దేవదాసు 94903 35238 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

పిడుగుపాటుకు ఇద్దరు మృతి



ఘటనా స్థలంలో విచారణ చేస్తున్న పోలీసులు

యద్దనపూడి: ఖరీఫ్ సీజన్‌కు పొలాలను సిద్ధం చేసుకునేందుకు వెళ్లిన ఇద్దరు పిడుగుపాటుకు బలయ్యారు. ఈ హృదయవిదారక ఘటన యద్దనపూడి మండలంలో జరిగింది. బాధిత కుటుంబాల కథనం ప్రకారం.. మండలంలోని ఉన్నవ గ్రామం పోలేరమ్మ గుడి సెంటర్‌లో నివాసం ఉండే పెద్ది చిన్నవీరయ్య ఆదివారం తెల్లవారుజామున తన మూడు ఎకరాల భూమిని గొర్రు, నాగళ్లు తోలేందుకు బయలుదేరాడు. వర్షం కురిసేలా ఉందని గ్రహించి, గ్రామంలోని గొట్టిపాడు రోడ్డులో రైస్‌మిల్లు వద్ద ఉండే చిరుతల శ్రీనివాసరావును పిలిపించి ఇద్దరు చెరో ట్రాక్టర్ తీసుకుని 5.30 గంటల సమయంలో పొలానికి వెళ్లారు. పనులు చేస్తున్న క్రమంలో ఓ ట్రాక్టర్‌లో ఆయిల్ అయిపోవడంతో తీసుకురావాలంటూ వీరయ్య తన బావమరిది ముప్పా బలరామయ్యకు ఫోన్ చేసి చెప్పాడు. ఈలోగా ఉరుములు, మెరుపులతో వర్షం కురవడం మొదలైంది. వీరయ్య, శ్రీనివాసరావు ఇద్దరు పొలం సమీపంలోని వేప చెట్టు కిందకు చేరారు. 7.15 గంటల సమయంలో ఒక్కసారిగా పెద్దశబ్దం చేస్తూ పిడుగు అదే చెట్టుపై పడటంతో దానికింద నిలుచున్న పెద్ది చిన్నవీరయ్య(58), చిరతల శ్రీనివాసరావు(51) ఘటనా స్థలంలోనే మృత్యువాత పడ్డారు. ఆయిల్ తీసుకుని గ్రామానికి వచ్చిన బలరామయ్య బావకు ఫోన్ చేయగా ఎంతకూ తీయకపోవడంతో పొలం వద్దకు వెళ్లి చూశాడు. అక్కడ వీరయ్య, శ్రీనివాసరావు విగత జీవులై పడి ఉండటంతో కుటుంబ సభ్యులకు, గ్రామపెద్దలకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు, రెవెన్యూ సిబ్బంది గ్రామానికి వచ్చి విచారణ జరిపారు. మృతదేహాలను చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కొడుకు వచ్చాకే వీరయ్య అంత్యక్రియలు

మృతి చెందిన వారిలో వీరయ్య రైతుకాగా, శ్రీనివాసరావు ట్రాక్టర్ డ్రైవర్. పెద్ది వీరయ్యకు భార్య రాజేశ్వరి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహం కాగా ప్రస్తుతం హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. కుమారుడు లీలాప్రసాద్ అమెరికాలో ఉద్యోగం చేస్తున్నాడు. కుంకులగుంట గ్రామానికి చెందిన శ్రీనివాసరావు ఉన్నవకు చెందిన వీరమ్మను వివాహమాడి ఇక్కడే స్థిరపడ్డాడు. ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న శ్రీనివాసరావు కుమారుడికి వివాహం కాగా, కుమార్తె హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. ఆదివారం రోజునే రెండు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. శ్రీనివాసరావు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించారు. సాయంత్రం అంత్యక్రియలు గ్రామంలో నిర్వహించారు. పెద్ది చిన్నవీరయ్య మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి ఫ్రీజర్‌లో భద్రపరిచారు. కుమారుడు అమెరికాలో ఉన్నందున మృతి విషయం తెలిసి ఇండియాకు బయలుదేరినట్లు సమాచారం. కుమారుడు రాగానే మంగళవారం అంత్యక్రియలు నిర్వహిస్తారని బంధువులు తెలిపారు.

గుర్తింపు కార్డు, ఈసీఐ పత్రం ఉంటేనే అనుమతి

- ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు
- జూన్ 4న సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ



సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. జూన్ 4న కౌంటింగ్ ప్రక్రియలో భాగస్వాములయ్యే ప్రభుత్వ ఉద్యోగులు, ఏజెంట్లకు మార్గదర్శకాలు జారీ చేశారు. జిల్లా ఎన్నికల అధికారి జారీ చేసే గుర్తింపు కార్డు, కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీఐ) జారీ చేసే అధికార పత్రం ఉంటేనే నరసరావుపేట సమీపంలోని కాకాని జేఎన్‌టీయూలోని కౌంటింగ్ హాలులోకి వీరిని అనుమతిస్తారు. రిటర్నింగ్ అధికారులు తప్ప లోపలకు ఎవ్వరూ సెల్‌ఫోన్లు, ఎటువంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్, కనీసం పెన్‌లు కూడా తీసుకెళ్లేందుకు వీలులేదు. కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు బయట ఏర్పాటు చేసే డిపాజిట్ కేంద్రంలో వీటిని అప్పగించాలి. కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులు, రెవెన్యూ అధికారులకు గుర్తింపు కార్డు, ఈసీఐ జారీ చేసిన పత్రం చూపించిన తర్వాతే కౌంటింగ్ హాలులోకి సిబ్బందిని, ఏజెంట్లను అనుమతిస్తారు. కౌంటింగ్ హాలులో టేబుల్స్ వారీగా విధులు నిర్వర్తించే కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లతోపాటు కౌంటింగ్ ఏజెంట్లకు ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల ద్వారా కలర్ కోడ్ ఇస్తూ గుర్తింపు కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ కేంద్రానికి గుర్తింపు కార్డుతోపాటు ఈసీఐ జారీ చేసిన అధికార పత్రం వెంట తీసుకురావాల్సి ఉంటుంది.

సిట్టింగ్ ఏర్పాట్లు ఇలా...

- వరుసలుగా ఏర్పాటు చేసిన టేబుల్స్‌పైనే పోలింగ్ కేంద్రాల వివరాల పట్టికలు ఏర్పాటు చేశారు. దానికనుగుణంగానే సిట్టింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.
- ప్రతి కౌంటింగ్ టేబుల్ వద్ద గుర్తింపు పొందిన జాతీయ పార్టీల అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్లు, గుర్తింపు పొందిన రాష్ట్ర పార్టీల అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్లు, రిజర్వ్ చేసిన లేక ఇతర రాష్ట్రాల గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థుల కౌంటింగ్ ఏజంట్లు, నమోదిత గుర్తింపులేని పార్టీల అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్లు, స్వతంత్ర అభ్యర్థుల కౌంటింగ్ ఏజెంట్లు ఓట్ల లెక్కింపు ప్రక్రియను పర్యవేక్షించేందుకు వీలుగా ఏర్పాట్లు పూర్తి చేస్తు న్నారు.

సిబ్బంది విధులు .. బాధ్యతలు

- కౌంటింగ్ సందర్భంలో గోప్యత పాటించడం, జవాబుదారీ తనం కలిగి ఉండాలి.
- రిటర్నింగ్ అధికారి సూచనల మేరకు కౌంటింగ్ ప్రక్రియ నిర్వర్తించాలి.
- మైక్రో అబ్జర్వర్లు, కౌంటింగ్ పరిశీలకుల సూచనలు పాటించాలి.
- గోప్యత నిర్వహణ కోసం ఓట్ల లెక్కింపు ప్రారంభానికి ముందు ఆర్.పి సెక్షన్ 128లోని నిబంధనలను ఆర్వో చదివి సిబ్బందికి వివరిస్తారు.

కౌంటింగ్ ఏజెంట్లు చేయాల్సింది..

- రిటర్నింగ్ అధికారికి ముందుగా కౌంటింగ్ ఏజెంట్ తన నియామక పత్రం, గుర్తింపు కార్డును సమర్పించిన తర్వాత ఆర్వో ముందు తన నియామక పత్రంలో ఉన్న డిక్లరేషన్‌పై సంతకం చేయాల్సి ఉంటుంది. సంబంధిత ఆర్వో ధ్రువీకరణ తర్వాత కౌంటింగ్ హాలులోకి అనుమతిస్తారు.
- ఒక టేబుల్ వద్ద ఆయా పార్టీ, అభ్యర్థి తరఫున ఒక ఏజెంట్‌నే అనుమతిస్తారు. ఏజెంట్‌ను ఏ అభ్యర్థి తరఫున ఏ టేబులు వద్ద కేటాయించారనేది జారీ చేసిన బ్యాడ్జి నిర్ధారణ చేసుకున్న తర్వాత మాత్రమే ఆర్వో అనుమతిస్తారు.
- ప్రతి ఏజెంట్ తమకు నిర్దేశించిన టేబుల్ వద్ద కూర్చొని లేదా నిలబడి కౌంటింగ్‌ను పరిశీలించుకోవచ్చు. కౌంటింగ్ కేంద్రం మొత్తం తిరగడానికి అవకాశం లేదు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్యాయత్నం


కుంచాల మంజుల

అద్దంకి: హెయిర్‌డైలో వ్యాస్మోల్ కలుపుకొని తాగి వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పట్టణంలోని ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో జరిగింది. సేకరించిన సమాచారం మేరకు సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామానికి చెందిన కుంచాల మంజుల గత కొంత కాలంగా భర్త అంకమ్మరావుతో కలసి పట్టణంలోని పాత శివాలయంకు సమీపంలో నివాసం ఉంటుంది. భర్త బేల్దారి పనులు చేస్తుంటాడు. ఆదివారం ఇరువురి మధ్య ఘర్షణ జరగ్గా, మంజుల బజారుకు వెళ్లి హెయిర్‌డై కొనుగోలు చేసి అందులో వేస్మోల్ కలుపుకొని తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించి బంధువులు 108కి సమాచారం అందించడంతో తొలుత ఆమెను అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి, మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో కార్మికుడు మృతి


మృతి చెందిన పిచ్చయ్య

బల్లికురవ: గ్రామంలో ఇంటింటి చెత్తను సేకరించే కార్మికుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన ఆదివారం అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిలోని కొప్పరపాడు గ్రామ సమీపంలో ఆదివారం జరిగింది. అందిన సమాచారం మేరకు కొప్పరపాడు గ్రామానికి చెందిన పందిరి పిచ్చయ్య (46) సుగాలీ తండాలో చెత్త సేకరణకు వెళ్తుండగా హైదరాబాద్ నుంచి ఒంగోలు వెళ్తున్న రాజస్థాన్‌కు చెందిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కార్మికుడు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య వెంకటరమణ, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. గ్రామంలో అందరితో కలివిడిగా ఉండే పిచ్చయ్యను రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించడంతో బంధువులు బోరున విలపించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ బందారు వెంకాయమ్మ గురవయ్య, కేవీ అనీల్‌కుమార్ భౌతిక కాయానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. నామ్ హైవే అధికారులు రోడ్డు అభివృద్ధిలో భాగంగా రహదారిని కొప్పరపాడు గ్రామ సమీపంలో మూసివేసి ఒక వైపు నుంచి రాకపోకలు కొనసాగించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని మృతుని బంధువులు ఆందోళన చేపట్టారు. భార్య వెంకటరమణ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రవిశంకర్‌రెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ప్రతి ఫామ్‌కూ ఓ లెక్కుంది!



నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియలో అధికార యంత్రాంగం అనేక ఫామ్‌లు వినియోగిస్తుంది. వీటిల్లో ప్రతి ఫామ్‌కూ ఒక ప్రాధాన్యం ఉంది. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఒకేసారి చేపడతారు. ఫలితాల బటన్ నొక్కగానే ప్రతి అభ్యర్థికీ పోలైన ఓట్లు ఈవీఎంలో కనిపిస్తాయి. ప్రతి రౌండ్ లెక్కింపునకు ముందు కౌంటింగ్ ఏజెంట్లతో 17-సీ ఫామ్‌లో తప్పనిసరిగా సంతకాలు తీసుకుంటారు. రౌండ్ల వారీగా ఫలితాలను ఫామ్ -20లో నమోదు చేసి కంట్రోల్ రూమ్, మీడియా కేంద్రాలకు తప్పనిసరిగా పంపిస్తారు. సువిధ యాప్‌లో నమోదు చేసిన తరువాత మాత్రమే రౌండ్ల వారీ ఫలితాన్ని అధికారికంగా ప్రకటిస్తారు.

కీలక ఫామ్‌లు ఇవీ..

- ఫామ్ 18: (కౌంటింగ్ ఏజెంట్ నియామకపత్రం): ఎన్నికల రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) జారీ చేసిన ఈ ధ్రువపత్రం ఉంటేనే అభ్యర్థుల ఏజెంట్లను కౌంటింగ్ కేంద్రం లోపలకు అనుమతిస్తారు
- ఎనగ్జర్ 38: ఓట్ల లెక్కింపునకు నియమితులైన పర్యవేక్షకులు, సహాయకులకు జారీ చేసే ధ్రువీకరణ పత్రం
- ఎనగ్జర్ 'ఎ': ఎంపిక చేసిన ఐదు వీవీ ప్యాట్ల వివరాలు ఉంటాయి
- ఎనగ్జర్ 'బి': వీవీ ప్యాట్లలోని స్లిప్పుల లెక్కింపు తరువాత ఏ అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయో ఎన్నికల పరిశీలకుడు ధ్రువీకరించే పత్రం
- ఫామ్ 21సీ : ఓట్ల లెక్కింపు అనంతరం వెంటనే ఫలితాలు దీనిలో నమోదు చేస్తారు.
- ఫామ్ 21ఈ : నియోజకవర్గంలో ఏ పార్టీకి, అభ్యర్థికి ఎన్ని ఓట్లు వచ్చాయి. ఎవరు విజయం సాధించారనే సమగ్ర వివరాలు దీనిలో ఉంటాయి.
- ఫామ్ 22 : విజయం సాధించిన అభ్యర్థికి ఎన్నికల అధికారి జారీ చేసే ధ్రువపత్రం. దీని ద్వారానే చట్టసభల్లో సభ్యులుగా ఎంపికవుతారు.
- ఎనగ్జర్ 58 : పార్ట్ 1లో పోలింగ్ బూత్‌ల వారీగా మొత్తం ఓట్లు, పోలైన ఓట్ల వివరాలుంటాయి. పార్ట్ 2లో పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్ల లెక్కింపు, ఆధిక్యాలు, ఫలితాల వివరాలుంటాయి.
- ఎనగ్జర్ 39 : దీనిలో తుది ఫలితం వివరాలు సమగ్రంగా ఉంటాయి. పోలింగ్ కేంద్రాల వారీగా ఓట్ల ఆధిక్యతలు నోటాతో సహా పొందుపరుస్తారు. ఆర్‌ఓ సంతకం చేసిన తరువాత దీనిని అధికారికంగా విడుదల చేస్తారు.

మద్యం తాగితే.. నో ఎంట్రీ

- కౌంటింగ్ కేంద్రం వద్ద బ్రీత్ ఎనలైజర్ టెస్టులు
- రేపు ఉదయం 6 గంటలకల్లా ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకోవాలి..

నెహ్రూనగర్: ఎన్నికల కౌంటింగ్ ఏజెంట్లు తప్పనిసరిగా ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలి. ఎటువంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా అధికారులు చర్యలు తీసుకుంటారు.

- కౌంటింగ్ కేంద్రం వద్ద రాజకీయ పార్టీల ఏజెంట్లకు ఆల్కహాల్ టెస్ట్(బ్రీత్ ఎనలైజర్‌తో) పరీక్షలు నిర్వహిస్తారు. ఆల్కహాల్ పర్సంటేజ్ ఉన్నట్లు చూపితే కేంద్రంలోకి అనుమతించరు.
- 4వ తేదీ ఉదయం 6 గంటలకల్లా కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలి.
- కలెక్టర్/ఆర్‌ఓ ఇచ్చిన గుర్తింపు కార్డును కలిగి ఉండాలి
- పార్టీ కార్యకర్తలను కౌంటింగ్ కేంద్రాల వద్దకు తీసుకు రాకూడదు
- కౌంటింగ్ కేంద్రాల బయట, రోడ్లపై విజయోత్సవ ర్యాలీలు నిషేధం. బాణసంచా కాల్చకూడదు
- ఫంక్షన్ హాల్స్, హోటల్స్‌లో జనసమీకరణ చేయకూడదు
- వాట్సాప్ గ్రూప్‌లు, ఇతర సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెట్టకూడదు
- ఇతర పార్టీ కార్యాలయాలు, నాయకుల ఇళ్ల వద్ద కవ్వింపు చర్యలకు దిగకూడదు
- ఓడిపోయిన అభ్యర్థులపై వ్యంగ్య వ్యాఖ్యలు చేయకూడదు
- 6వ తేదీవరకు ఎలాంటి ర్యాలీలు, ఊరేగింపులు చేయకూడదు
- ఎంసీసీ ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారు.

అంతర్జాతీయ బీచ్ వాలీబాల్‌లో మెరిసిన నాగరాజు


పోటీలో తలపడుతున్న నాగరాజు

వేటపాలెం: చైనాలో జరిగిన పారా ఒలింపిక్స్ బీచ్ వాలీబాల్ పోటీల్లో దేశం వెండి పతకం సాధించింది. ఈనెల 28 నుంచి జూన్ 2వ తేదీ వరకు చైనాలో అంతర్జాతీయ బీచ్ వాలీబాల్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో వేటపాలెం మండలం పందిళ్లపల్లికి చెందిన దివ్యాంగ క్రీడాకారుడు పిచ్చుక నాగరాజు భారత జట్టు కెప్టెన్‌గా వ్యవహరించాడు. క్రీడలో ఉత్తమ ప్రదర్శన చూపి జట్టుకు పతకం సాధించిపెట్టాడు. పతకం సాధించిన నాగరాజును పలువురు అభినందించారు.

ఆదినుంచి ఉత్తమ ప్రదర్శనలు..

పందిళ్లపల్లికి చెందిన నాగరాజు చిన్నతంలోనే ప్రమాదవశాత్తు ఒక చేయి కోల్పోయాడు. అయితే చిన్నప్పటి నుంచే వాలీబాల్ క్రీడపై ఉన్న మక్కువ, పట్టుదలతో క్రీడలో శిక్షణ పొందాడు. స్కూల్, కాలేజీ స్థాయిల్లో అనేకపోటీల్లో పాల్గొన్నాడు. హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్రస్థాయిలో జరిగిన దివ్యాంగ వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నాడు. 2009లో చెన్నైలో జరిగిన జాతీయస్థాయి బీచ్ వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి రాష్ట్రం తరఫున పాల్గొన్నాడు. ఆ తరువాత కంబోడియాలో జరిగిన అంతర్జాతీయ పోటీలకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. 2010లో జరిగిన పోటీల్లో రెండోసారి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. అప్పుడు జరిగిన అంతర్జాతీయ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించాడు. 2011లో జర్మనీలో జరిగిన బీచ్ వాలీబాల్ పోటీల్లో ఇండియా టీమ్‌కు వైస్ కెప్టెన్‌గా వ్యవహరించాడు. అనంతరం బెంగళూరులో శ్రీలంకతో జరిగిన ఫ్రెండ్లీ వాలీబాల్ పోటీల్లోనూ పాల్గొన్నాడు. 2013లో జరిగిన వాలీబాల్ పోటీల్లో రాష్ట్రం తరఫున జాతీయ పోటీలకు ఎంపికై ఈ పోటీల్లో నాలుగో స్థానం సాధించాడు.

గుర్తుకొస్తున్నాయి..!


ఒకే వేదికపై పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు

స్వర్ణ జడ్పీ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమావేశం

కారంచేడు: 25వ సంవత్సరాల క్రితం కలసి చదువుకున్నారు. దేశ, విదేశాల్లో స్థిరపడ్డారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, వ్యవసాయం వంటి వివిధ రకాల వృత్తుల్లో ఉన్న వారంతా కలుసుకోవాలని ఆశపడ్డారు. దీనికి పూర్వ విద్యార్థులు కొంతమంది ప్రత్యేక చొరవ తీసుకున్నారు. తమ స్నేహితులు ఎక్కడెక్కడ ఉన్నారో సమాచారం సేకరించి, అందరికీ సమాచారం అందించారు. దీనికి మండలంలోని స్వర్ణ గ్రామంలో తాము చదువుకున్న పాఠశాల వేదికైంది. స్వర్ణ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. పాతికేళ్ల తర్వాత తమ స్నేహితులను కలుసుకోవడంతో అందరూ సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యారు. ఒకరి యోగక్షేమాలు ఒకరు తెలుసుకుని పరవశించారు. నాటి ముచ్చట్లు చెప్పుకుంటూ పసి పిల్లలుగా మారారు. నాటి గురువులను ఘనంగా సత్కరించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాటి సైన్స్ టీచర్ శ్రీనివాసరావు, పీఈటీ కొమ్మన బోయిన వీరయ్య, పాఠశాల స్థల దాత పి.రంగారావు, ప్రస్తుత స్థానిక ఉపాధ్యాయుడు పీవీ సుబ్బారావు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో తెనాలి లిఫ్టర్లకు పతకాలు



విజేతలతో కోచ్ సాయిరేవతి

తెనాలి: మంగళగిరిలో గత నెల 29-31 తేదీల్లో జరిగిన 11వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక క్విక్ ఫిట్‌నెస్ ఎరీనాకు చెందిన పలువురు లిఫ్టర్లు పతకాలను సాధించారు. జూనియర్స్‌లో 84 కిలోల విభాగంలో పోటీపడిన ఏటూరి లక్ష్మీవిజయశ్రీ రెండు బంగారు పతకాలు, 43 కిలోల విభాగంలో తలపడిన మదిర షానూన్ రెండు బంగారు పతకాలను సాధించటమే కాకుండా సీనియర్స్‌లో 47 కిలోల విభాగంలోనూ పోటీపడి మరో బంగారు పతకాన్ని గెలుచుకోవటం విశేషం. 93 కిలోల విభాగంలో సంకా కౌశిక్ కాంస్యం సాధించగా పడాల దేవేంద్రరెడ్డి జూనియర్స్, సీనియర్స్ విభాగాలు రెండింటిలోనూ 120 ప్లస్ కిలోల విభాగంలో పోటీపడి జూనియర్స్‌లో రెండు బంగారు, సీనియర్స్‌లో రజత పతకాన్ని సాధించారు. సీనియర్ 120 కిలోల విభాగంలో పూసపాటి శివరామ కిరణ్‌రాజు రజత పతకం కైవసం చేసుకోగా, జూనియర్ 83 కిలోల్లో కనకి శ్రీకాంత్ నాలుగో స్థానంలో నిలిచినట్టు కోచ్ ఘట్టమనేని సాయిరేవతి, పూసపాటి శివరామకిరణ్‌రాజు ఆదివారం ప్రకటించారు. క్విక్ జిమ్ మేనేజ్‌మెంట్ హెడ్ కొమ్మినేని భార్గవ్‌కుమార్ విజేతలను అభినందించారు.

భద్రత పెంపువార్తలు అవాస్తవం

నగరంపాలెం: కొన్ని సామాజిక మాధ్యమాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ సీఎం, ప్రతిపక్షనేత చంద్రబాబు నివాసాల వద్ద భద్రత పెంపు అంటూ వైరల్ అవుతున్న వార్తలను జిల్లా ఏఎస్పీ (క్రైం) శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. సీఎం నివాసం వద్ద, ప్రతిపక్ష నేత నివాసం వద్ద రోజూ ఉండే భద్రతే ఉందని అన్నారు. అదనపు భద్రత కల్పించామనే వార్తలు పూర్తిగా అవాస్తమని తెలిపారు. ఈనెల నాలుగో తేదీ ఓట్ల లెక్కింపు సందర్భంగా బందోబస్త్ విధులకు హాజరయ్యేందుకు వచ్చిన సిబ్బంది డ్యూటీ పాయింట్లకు వెళ్తున్నారని అన్నారు. ఎప్పటి వలె సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాసం వద్ద, మాజీ సీఎం చంద్రబాబు నివాసం వద్ద పోలీస్ పహారా కొనసాగుతుందని తెలిపారు.

లైంగికదాడియత్నంపై కేసు

కారంచేడు: మండల కేంద్రమైన కారంచేడు పుట్టాయిపాలెం ప్రాంతానికి చెందిన వివాహిత మహిళపై అదే ప్రాంతానికి చెందిన పి.వీరాంజనేయులు లైంగికదాడి యత్నం చేశాడు. బాధిత మహిళ ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ కె.సురేష్ అందించిన సమాచారం మేరకు.. పుట్టాయిపాలెం (గంగమ్మ గుడి సెంటర్) ప్రాంతానికి చెందిన ఓ మహిళ గేదె తప్పిపోవడంతో దాన్ని వెదికేందుకు శనివారం మధ్యాహ్నం ఆదిపూడి రోడ్డులోని వీరతాళ్ల కుంట వైపునకు వెళ్లింది. దీంతో అక్కడ ఉన్న వీరాంజనేయులు ఆ మహిళను వెంబడించి పట్టుకొని, దుర్భాషలాడి, లైంగికదాడి యత్నం చేశాడు. ఆమె కేకలు పెట్టడంతో పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, నిందితుడిని త్వరలో పట్టుకొని కోర్టుకు హాజరు పరుస్తామని ఎస్‌ఐ తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి గుంటూరు ప్రాంతీయ కార్యాలయం ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ ఎం.నారాయణ తెలిపారు. ఆదివారం పేరేచర్ల సమీపంలోని కైలాసగిరి క్షేత్రం వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మన భూమి-మన భవిష్యత్, పర్యావరణ పునరుద్ధరణ మన ప్రస్తుత ప్రాధాన్యత అనే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపైనున్న ఆలయం చుట్టూ ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించారు. కొండపై వేప, గానుగ, చింత, నేరేడు తదితర 3000 విత్తనాలను బంకమట్టితో కలిపి కొండపై పరిసర ప్రాంతాల్లో చల్లారు. ఇలా బంకమట్టిలో కలిపి చల్లటం ద్వారా వర్షాకాలంలో విత్తనాలు మొలకెత్తి మొక్కలుగా మారి వృక్ష సంపదను పెంచుతాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ద్వారానే మానవ మనుగడ సాధ్యమని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు, పెళ్లిరోజు, ఇతర ముఖ్య దినాల్లో ఒక మొక్కను నాటి వాటి సంరక్షణ చేయాలన్నారు. వృక్ష సంపదను 33శాతంకు అభివృద్ధి చేసి ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు అవ్వాలన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల రానున్న కాలంలో పెనుముప్పు పొంచిఉందన్నారు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కె.సుధ, కె.సుమంత్, సిబ్బంది నాగార్జున, శివయ్య, శివారెడ్డి, స్థానిక ప్రజలు తదితరులున్నారు.

చలపతి ఫార్మసీలో ప్రారంభమైన చెస్ పోటీలు


చెస్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

గుంటూరు రూరల్: విద్యార్థులకు విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రావీణ్యత అవసరమని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. ఆదివారం నగర శివారులోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్, చలపతి ఫార్మసీ కళాశాల, శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు తెలుగు రాష్ట్రాల చెస్ పోటీలు ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి 292 మంది చెస్ క్రీడాకారులు పోటీలలో పాల్గొన్నారన్నారు. వీరిలో అంతర్జాతీయ క్రీడాకారులు 87 మంది ఉన్నారని తెలిపారు. అదేవిధంగా వరల్డ్ చెస్ ఫెడరేషన్ టైటిల్ హోల్డర్ ఉమెన్ ఫీడ్ మాస్టర్ అనుష, సుప్రీత, ఫీడ్‌మాస్టర్ కృష్ణ కార్తీక్ ఇతర టైటిల్ క్రీడాకారులు హాజరయ్యారని తెలిపారు. ఈ పోటీలలో 7 రౌండ్లకుగానూ ఆదివారం 5 రౌండ్లు ముగిశాయని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ ఆనంద్ చెస్ అకాడమీ డైరెక్టర్ ఎం.గోపినాథ్, ఏపీ చెస్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

బోయపాలెం నూలుమిల్లులో ఇద్దరు పిల్లలకు మలేరియా

యడ్లపాడు: బోయపాలెం పారిశ్రామికవాడకు వలసొచ్చిన కూలి కుటుంబంలో ఇద్దరు చిన్నారులకు మలేరియా వ్యాధి సోకింది. గ్రామంలోని విశ్వతేజ నూలుమిల్లులో పనిచేసే ఓ కూలీ ఇద్దరు పిల్లలు జ్వరంబారిన పడ్డారు. ఎంతకీ అది తగ్గకపోవడంతో రక్తపరీక్షలు చేయించారు. మొదట వైరల్ ఫీవర్ అనుకున్న వైద్యులు పరీక్షల్లో మలేరియా వచ్చినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న యడ్లపాడు పీహెచ్‌సీ వైద్యాధికారులు చిన్నారులను యుద్ధ ప్రాతిపదికన గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. మిల్లు క్వార్టర్లలో సదరు కుటుంబ సభ్యులు నివసించే గదితోపాటు మిల్లు ప్రాంగణం అంతా పారిశుధ్య పనులు చేయించి బ్లీచింగ్ చల్లి, దోమల నివారణకు యంత్రాలతో ఫాగింగ్ చేయించారు. మిల్లులోని సిబ్బంది, కార్మికులకు ఆరోగ్య సిబ్బంది మలేరియా లక్షణాలు, నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ విషయంపై పల్నాడు జిల్లా వైద్యాధికారి బి.రవిని వివరణ కోరగా.. జిల్లాలో మలేరియా పాజిటివ్స్ లేవని, విశ్వతేజ మిల్లులోని కార్మిక కుటుంబం ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు స్వగ్రామం పాడేరు గ్రామానికి వెళ్లి వచ్చిందని వివరించారు.

ఆరోగ్యానికి సైక్లింగ్

- నగరంలో సైక్లింగ్‌కు పెరుగుతున్న ఆదరణ
- అనేక రోగాలను నియంత్రించ వచ్చంటున్న వైద్యులు
- చిన్ననాటి నుంచి పిల్లలకు సైక్లింగ్ అలవాటు చేయాలంటున్న నిపుణులు
- నేడు ప్రపంచ సైకిల్ దినోత్సవం


ఉల్లాసంగా సాగిపోతున్న సైక్లిస్టులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): చిన్నప్పుడు సరదాగా తొక్కే సైకిల్‌తో ఎన్ని ఉపయోగాలున్నాయో అప్పుడు తెలియదు. ఇప్పుడు అనారోగ్య సమస్యల బారిన పడినప్పుడు, లేదా చక్కని ఆరోగ్యానికి సైక్లింగ్ చేయమని వైద్యులు, నిపుణులు చెబుతుంటే దాని ప్రాముఖ్యత తెలుస్తుంది. అతి తక్కువ ఖర్చుతో మన ఆరోగ్యాన్ని కాపాడుకునే అనేక మార్గాలలో సైక్లింగ్ ఒకటి. ఇప్పుడు నగరంలో సైక్లింగ్ ఒక ట్రెండ్‌గా మారింది. కాదు కాదు.. వైద్యులు ట్రెండ్ సెట్ చేసి దానిని అమలు పరుస్తున్నారు. అవును కొందరు వైద్యులు చాలా కాలం క్రితం సైక్లింగ్ ప్రాముఖ్యతను తెలియజెప్పేందుకు ఒక క్లబ్ స్థాపించి ప్రమోట్ చేయడంతో ఇప్పుడు అది కొన్ని వేల మందిని సైకిల్ తొక్కేలా చేసింది. ఇంకా చెప్పాలంటే అత్యాధునిక సైకిల్స్‌ను నగరంలోకి తెచ్చేంతగా చేసింది. ప్రతి ఏడాది జూన్ 3న ప్రపంచ సైకిల్ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా జరుగుతుంది. ఈ నేపథ్యంలో పట్టణంలో సైక్లింగ్‌పై ఒక లుక్ వేద్దాం...

రోజుకు 30 నిమిషాలు

మారుతున్న జీవన శైలి, పెరుగుతున్న అనారోగ్య సమస్యలను కట్టడి చేయాలంటే కొంచెం బరువు తక్కువ ఉన్న సైకిల్స్‌ను ఎంపిక చేసుకుని రోజుకు కనీసం 30 నుంచి 60 నిమిషాలు సైక్లింగ్ చేస్తే కలిగే ఆరోగ్య ప్రయోజనాలు అంతా ఇంతా కాదు. ఉన్నత విద్యను అభ్యసించి నగరంలో ప్రముఖ వైద్యులుగా వెలుగొందుతున్న కొందరు వైద్యులు నిత్యం సైక్లింగ్ చేస్తూ వారి ఆరోగ్యాన్ని రీసైక్లింగ్ చేసుకుంటున్నారు. దీనిని గుర్తించిన నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు తాను సైకిల్ తొక్కడంతోపాటు నగరంలో కొన్ని రోడ్లను సైకిల్ జోన్లుగా మార్చేందుకు కొంత ప్రయత్నం చేశారు. ప్రస్తుతం నగరంలో సుబ్బయ్యలాంటి ప్రొఫెషనల్ సైక్లిస్టులు ఉన్నారు. వారు ఔత్సాహికులకు మంచి ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు.

బహుళ ప్రయోజనాలు..



సైక్లింగ్‌తో బహుళ ప్రయోజనాలుంటాయనడంలో సందేహంలేదు. మధుమేహ రోగులు సైక్లింగ్ చేయడంవల్ల ఇన్సులిన్ ఉత్పత్తి మెరుగవుతుంది. దీంతోపాటు కండరాలు, ఎముకలు, గుండె, ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉంటాయి. దేహాన్ని ఉత్సాహంగా ఉంచేందుకు దోహదపడుతుంది. అయితే పెద్ద పెద్ద సర్జరీలు జరిగినప్పుడు, మోకాళ్ల కీళ్ల సమస్యలున్నప్పుడు వైద్యుల సలహా మేరకు సైక్లింగ్ చేయాలి. మనకి అనువైన సైకిల్‌ను ఎంపిక చేసుకోవాలి. ప్రారంభంలో సీనియర్ సైక్లిస్టుల పర్యవేక్షణలో తొక్కితే మంచిది. దూరం ప్రయాణించేటప్పుడు మంచినీళ్లతోపాటు గ్లూకోజ్ లాంటివి వెంటతీసుకెళ్లాలి. ప్రస్తుతం గుంటూరులో పేరొందిన ఎందరో వైద్యులు సైక్లింగ్ బాగా చేస్తున్నారు.

– డాక్టర్ కె.సుబ్బారావు, ఎండో క్రైనాలజిస్ట్

తొలి క్లబ్‌ను మేమే ఏర్పాటు చేశాం



గతంలో డాక్స్ (డాక్టర్స్ అండ్ సైకిల్) క్లబ్‌ను గుంటూరులో ఏర్పాటు చేసి సైక్లింగ్ ప్రమోట్ చేసాం. వైద్యులు, ఔత్సాహిక సైక్లిస్టులతో ర్యాలీలు నిర్వహించాం. అది తర్వాత కాలంలో ఎంతో ప్రాచుర్యం పొందింది. మా పేషెంట్లకు సైకిల్ తొక్కమని చెబుతుంటాం. మేము కూడా నిత్యం సైక్లింగ్ చేస్తుంటాం. సైక్లింగ్ చేసేటప్పుడు కాలేజీ రోజులు గుర్తుకు వస్తాయి. మంచి సర్కిల్ ఏర్పడుతుంది. వ్యసనాలకు దూరంగా ఉండవచ్చు. ప్రస్తుతం గుంటూరులో 6 క్లబ్‌ల వరకు ఉన్నాయి. వీరంతా సైక్లింగ్ ప్రమోట్ చేస్తున్నారు..

– డాక్టర్ సతీష్, సైక్లిస్ట్

70 ప్లస్‌లోనూ సైక్లింగ్ ..



ప్రస్తుతం నా వయస్సు 72 సంవత్సరాలు. నేను గత పదేళ్లకు పైగా సైక్లింగ్ చేస్తున్నాను. సైక్లింగ్‌తో నిత్యం ఉత్సాహంగా ఉంటుంది. వయస్సు వచ్చింది.. ఇప్పుడు ఎందుకు సైక్లింగ్ అనుకోవద్దు. అవకాశమున్నంత వరకు చేయాలి. సైక్లింగ్, చక్కని ఆహార అలవాట్లు ఉంటే ఎన్నో జబ్బులను నియంత్రించుకోవచ్చు. ముఖ్యంగా పిల్లలను తల్లి దండ్రులు సైక్లింగ్‌కు ప్రోత్సహించాలి. సెల్‌ఫోన్లకు పరిమితమైపోవడంతోనే ఊబకాయం బారిన పడుతున్నారు..

– డాక్టర్ ధనుంజయరావు, గుంటూరు

వెయ్యి సెంచరీలకు చేరువలో..




నేను గత నాలుగేళ్ల నుంచి సైక్లింగ్ చేస్తున్నాను. ప్రొఫెషనల్‌గా మారాను. ఇప్పటివరకు సుమారు లక్షా 30 వేల కిలోమీటర్లు సైకిల్ తొక్కాను. 965 సెంచరీలు అంటే ఒకేసారి ఆపకుండా 100 కిలోమీటర్లు తొక్కితే సెంచరీ అంటారు. ఇటువంటివి ఇప్పటి వరకు 965 సార్లు చేశాను. వెయ్యి సెంచరీలకు చేరువలో ఉన్నాను. సరదాగా మొదలైన ఈ ప్రయాణం వ్యసనంగా మారిపోయింది. ఎవరైనా సైక్లింగ్‌పై అవగాహన కావాలంటే సంప్రదించవచ్చు. సైక్లిస్టులకు స్ట్రావ్ యాప్ ఉంటుంది. అందులో అన్నివివరాలు నమోదువుతాయి. ప్రభుత్వం కూడా రోడ్లపై సైకిల్‌కు ట్రాక్ వేస్తే బాగుంటుంది.

– బండ్లమూడి సుబ్బయ్య, ప్రొఫెషనల్ సైక్లిస్ట్

మళ్లీ వైఎస్సార్ సీపీదే అధికారం

వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్



వెల్దుర్తి: వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని ఆపార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 2024 శాసనసభ ఎన్నికల ఫలితాలపై మెజార్టీ ఎగ్జిట్ పోల్స్ సంస్థలు వైఎస్సార్ సీపీ విజయం తథ్యమని స్పష్టం చేశాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మహిళలు, గ్రామీణులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు జైకొట్టారని పేర్కొన్నారు. మీ ఇంట్లో మంచి జరిగి ఉంటేనే ఓట్లు వేయాలని చెప్పిన ఏకైక సీఎం దేశంలో జగన్ ఒక్కరేనని స్పష్టం చేశారు. ప్రజలను మోసం చేయడమే ఆస్తిగా, వెన్నుపోటే పెట్టుబడిగా రాజకీయాల్లో ఎదిగిన నేత చంద్రబాబు అని విమర్శించారు. ఆయన రాజకీయ జీవితమంతా ప్రజలను వంచించడంతో గడిచిపోయిందని ధ్వజమెత్తారు. ఇప్పుడు ఈ ఎన్నికల్లో ప్రజలను మరోమారు నమ్మించడానికి బాబు పొత్తులతో కుయుక్తులు పన్నారని, వాటిని ప్రజలు గమనించి తిప్పికొట్టారని నాయక్ పేర్కొన్నారు.